# నేటినుంచి మళ్లీ జనంలోకి కేసీఆర్

## రామగుండం నుంచి బస్సుయాత్ర పునఃప్రారంభం • సిద్దిపేట సభతో ఎన్నికల ప్రచారానికి ముగింపు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు బస్సుయాత్ర శుక్రవారం నుంచి తిరిగి కొనసాగనున్నది. కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేయకుండా ఎన్నికల సంఘం 48 గంటల విధించిన నిషేధం శుక్రవారం రాత్రి 8 గంటలకు ముగియనున్నది. ఈ తర్వాత కేసీఆర్ తిరిగి జనంలోకి వెళ్లనున్నారు. రామగుండం నుంచి బస్సుయాత్ర పునఃప్రారంభం కానున్నది. గతనెల 24న మిర్యాలగూడలో ప్రారంభమైన కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షో అప్రతిహతంగా కొనసాగుతున్నది. కేసీఆర్ తమ పార్టీపై చేసిన వ్యాఖ్యలు నియామవళికి విరుద్ధమని కాంగ్రెస్ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈసీ 48 గంటలపాటు ఆయనపై నిషేధం విధించడంతో గురువారం జమ్మికుంటలో కేసీఆర్ నిర్వహించాల్సిన రోడ్‌షో రద్దు అయిన విషయం తెలిసిందే. ఈసీ విధించిన గడువు శుక్రవారం రాత్రి 8 గంటలతో ముగిసిన తర్వాత కేసీఆర్ రామగుండంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌ను బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసింది. రామగుండంలో మొదలై సిద్దిపేట బహిరంగ సభతో బస్సుయాత్ర ముగియనున్నది. ముందస్తు షెడ్యూల్‌లో ఒక్క జమ్మికుంట మినహా కేసీఆర్ ప్రచార పర్యటన అంతా యథాతథంగా సాగుతున్నది.

### ఫలితాలతోనే కుట్రలకు చెక్


కేసీఆర్ బస్సు యాత్రతో సమీకరణాలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతున్నాయని, కేసీఆర్ ఎక్కడుంటే అక్కడ జనసంద్రం పోటెత్తుతున్నదని గ్రహించిన కాంగ్రెస్, బీజేపీ ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కమిషన్ నియమాలను సాకుగా చూపి నిలువరించే ప్రయత్నం చేశాయని బీఆర్ఎస్ భగ్గుమన్నది. తమ నిజ స్వరూపాన్ని కేసీఆర్ బయటపెడుతున్నారనే అక్కసుతోనే ఆ పార్టీలు మిలాఖత్ అయి కేసీఆర్‌ను నిలువరించాలన్న కుట్రలు ప్రజల ముందు నిలపడవని చెప్తున్నది. కేసీఆర్ కార్యాచరణను కేవలం 48 గంటలపాటు నిలిపివేసినంత మాత్రాన ప్రజానిరసన నుంచి వారు తప్పించుకోలేవని అంటున్నది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని,ఈసీ ఆదేశాల మేరకు కేసీఆర్ 48 గంటలు ప్రచారాన్ని నిలిపివేశారని పేర్కొన్నది. ఆ రెండూ ఒక్కటై బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని ఎన్ని కుట్రలు చేసినా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే ఆ పార్టీలకు తగిన బుద్ధిచెప్తాయని పార్టీ శ్రేణులు స్పష్టం చేశాయి.



**కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్‌షో షెడ్యూల్**

| తేదీ | రోడ్‌షో పట్టణం |
|---|---|
| మే 3 | రామగుండం |
| మే 4 | మంచిర్యాల |
| మే 5 | జగిత్యాల |
| మే 6 | నిజామాబాద్ |
| మే 7 | కామారెడ్డి, మెదక్ |
| మే 8 | నర్సాపూర్, పటాన్‌చెరు |
| మే 9 | కరీంనగర్ |
| మే 10 | సిరిసిల్ల రోడ్‌షో, సిద్దిపేట బహిరంగ సభ |

**లోకం పోకడ**




పెరిగిన ఎండలతో జనానికి రెడ్ అలర్ట్.. అలాగే బీఆర్ఎస్‌కు పెరిగిన ప్రజాదరణతో కాంగ్రెస్, బీజేపీలకు పింక్ అలర్ట్!



బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారంలో రాముడి ఫొటోను ప్రదర్శిస్తూ ఓట్లు అడుగుతున్న దృశ్యాన్ని ప్రదర్శిస్తున్న కేటీఆర్



ఓయూలో నీళ్లు, కరెంట్ కోతల కారణంగా సెలవు ప్రకటించడాన్ని నిరసిస్తూ ధర్నా చేస్తున్న విద్యార్థుల సమస్యపై కేసీఆర్ ట్వీట్‌ను ప్రదర్శిస్తున్న కేటీఆర్

# బీజేపీ కనుసన్నల్లో ఈసీ

- మోదీ, రేవంత్ ప్రసంగాలపై చర్యలేవీ?
- మోదీపై చర్యలు తీసుకునే ధైర్యం లేదా?
- రేవంత్ మాటలు నీతిసూక్తుల్లా ఉన్నాయా?
- కేసీఆర్‌పై ఆగమేఘాలపై చర్యలా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో పొన్నాల లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల సంఘం బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు మత వైషమ్యాలు రెచ్చగొట్టేవిధంగా మాట్లాడినా, సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన మాట్లాడినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని దుయ్యబట్టారు. మోదీపై చర్యలు తీసుకునే దమ్ము, ధైర్యం ఎన్నికల సంఘానికి లేదని, కనీసం నోటీసులు ఇవ్వడానికి కూడా జంకుతున్నదని విమర్శించారు. రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులపై తాము ఇప్పటివరకు 27 ఫిర్యాదులు చేశామని, ఒక్కదాని మీద కూడా చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. కేసీఆర్ రోడ్‌షోలకు వస్తున్న ప్రజాదరణను చూసి కాంగ్రెస్, బీజేపీలకు దడ పుట్టిందని ఎద్దేవా చేశారు. ప్రజా స్పందనను చూసి ఓర్వలేక కేసీఆర్ ప్రచారంపై 48 గంటల నిషేధం విధించారని మండిపడ్డారు. గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం తీరును తూర్పారబట్టారు. మోదీ, అమిత్‌షా మత వైషమ్యాలు రెచ్చగొట్టేవిధంగా మాట్లాడినా, దారుణమైన వ్యాఖ్యలు చేసినా, ప్రత్యర్థి పార్టీలను బండబూతులు తిడుతున్నా, బీజేపీ ట్విట్టర్ ఖాతాలో ముస్లింలపై డైరెక్ట్‌గా విషం చిమ్ముతూ పోస్ట్‌లు చేస్తున్నా వారిపై చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలే ఎక్కువమంది పిల్లలను కంటారని, ఇతర పార్టీలు అధికారంలోకి వస్తే ముస్లింలకు ఆస్తులను పంచేస్తారంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా దాదాపు 20 వేల ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై కనీసం మోదీకి ఈసీ నోటీసులు కూడా ఇవ్వలేదని చెప్పారు. బీజేపీ అధికారిక ట్విట్టర్ ఖాతాలో రాముడి ఫొటో పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారంటూ ఆధారాలను చూపించారు. బీజేపీ అభ్యర్థి అరుణ్‌గోగుల్ రాముడి ఫొటోతో ఎన్నికల ప్రచారం చేస్తున్నా, మోదీ విద్వేష వ్యాఖ్యలు చేసినా, అమిత్‌షా దేవుని ఫొటోలు పెట్టుకొని ఓట్లు అడిగినా ఎన్నికల కమిషన్‌లో ఉలుకు-పలుకు ఉండదని విమర్శించారు. కానీ, కేసీఆర్ విషయంలో మాత్రం ఆగమేఘాల మీద నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. సిరిసిల్లలో ఎండిన పంటలు, రైతుల ఆర్తనాదాలు విన్న తరువాత, సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలను చూసి నిరోధ్‌లు, పాపాడాలు అమ్ముకోవాలని ఒక దుర్మార్గుడు అంటే, దానిని ఖండిస్తూ కేసీఆర్ కొంచెం కఠిన పదాలు వాడారని వివరించారు.

### కేసీఆర్ గొంతు నొక్కి..

4 కోట్ల ప్రజల తరుపున మాట్లాడుతున్న కేసీఆర్ గొంతు నొక్కి, 48 గంటలపాటు ఎన్నికల ప్రచారం చేయకుండా నిషేధంవిధించిన ఈసీకి రేవంత్‌రెడ్డి మాటలు నీతిసూక్తులు, ప్రవచనాలు, సుభాషితాల్లాగా కనిపిస్తున్నాయా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ తలనరకండని అంటూ రేవంత్ మాట్లాడారని ఆక్షేపించారు. బీఆర్ఎస్ ఫిర్యాదులపై ఈసీ చర్యలు తీసుకోలేదని, మంత్రి సురేఖను మందలించి సరిపెట్టిందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలకు ఓటు ద్వారానే జవాబు చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### స్వతంత్ర సంఘమేనా..?

ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థ అయితే మోదీ, రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు భయపడుతున్నదని కేటీఆర్ నిలదీశారు. కేసీఆర్ గొంతును 48 గంటలు నిషేధించవచ్చని, కానీ కేసీఆర్ తయారుచేసిన కార్యకర్తలను గ్రామ గ్రామాన అడ్డుకోలేరని స్పష్టంచేశారు. కాంగ్రెస్, బీజేపీలు వేరువేరు కాదని, ఆ రెండూ ఒక్కటిగానే భావిస్తున్నామని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి పొన్నాల, మాజీ ఎంపీ రావుల, మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజాపాలనంటూనే.. పోలీస్ పాలన!

**బీఆర్ఎస్ లక్ష్యంగా ఫిర్యాదులు, అరెస్టులు** | సోషల్ మీడియాలోనూ గొంతునొక్కే యత్నం | కేటీఆర్, బాల్క, మల్లారెడ్డి, జీవన్‌రెడ్డిపై కేసులు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ప్రజాపాలన పేరుతో.. పోలీసు పాలన కొనసాగుతున్నదా? కాంగ్రెస్ పాలనలో సోషల్ మీడియాలోనూ ప్రశ్నించే గొంతులను పిసికేస్తున్నారా? ఎటుచూసినా అక్రమ కేసులు, భౌతిక దాడులతో గూండాగిరి రాజ్యమేలుతున్నదా? అంటే అవుననే అంటున్నారు తెలంగాణవాదులు. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లు కక్షలు, కేసులు, పగలు, కుట్రలు లేకుండా పాలన సాగితే.. కేవలం నాలుగు నెలల్లోనే ప్రజాపాలనలో అక్రమ కేసులు, భౌతిక దాడులు, హత్యాయత్నాలు, నిర్బంధపు అరెస్టులు నిత్యకృత్యంగా మారాయి. నేటి కాంగ్రెస్ పాలనలో ఒక ప్రశ్నకు ఎదురుదాడే జవాబుగా మారింది. ఒకమాటకు భౌతికదాడి సమాధానవుతున్నది. ఒక పోస్టుకు పోలీసు నోటీసులే నిదర్శనంగా మారాయి. ఆఖరికి సోషల్ మీడియాలో కూడా స్వేచ్ఛగా మాట్లాడనివ్వకుండా ఎక్కడికక్కడే గొంతునొక్కే ప్రయత్నం ఓ యజ్ఞంలా సాగుతున్నదని తెలంగాణవాదులు వాపోతున్నారు.

### క్రిశాంక్ మెడపై నోటీసుల కత్తిపెట్టి..

గ్రామాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తలు మొదలు, పార్టీ అధినేత వరకు ఏం మాట్లాడినా అక్రమంగా కేసులు పెట్టించడమే కాంగ్రెస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. ఇటీవల కేసీఆర్ మాట్లాడిన మాటలను సైతం వక్రీకరించి ఫిర్యాదుచేసి ఎలక్షన్ కమిషన్‌తో 48 గంటలు ప్రచారాన్ని ఆపించగలిగారని, తాజాగా సీఎం చేసిన ఫేక్ పోస్టును ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను ఏకంగా అరెస్టు చేశారని అంటున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 4 నెలల్లోనే క్రిశాంక్‌పై ఆరు కేసులు నమోదు చేయడం అత్యంతహేయమని విద్యార్థి నేతలు వాపోతున్నారు. సీఎం ఫేక్ ప్రచారాన్ని, అక్రమ కేసులను వదిలిపెట్టేది లేదని, కోర్టుల్లో పో రాడుతానని క్రిశాంక్ తెలిపారు.

### కార్యకర్తలు మొదలు.. జర్నలిస్టుల వరకూ!

ప్రశ్నకు జవాబు చెప్పలేక బీఆర్ఎస్ కార్యకర్తలను హత్యలు చేయించే స్థాయికి కాంగ్రెస్ దిగజారిందని పార్టీశ్రేణులు వాపోతున్నాయి. బోగుడతండాలో రోడ్డు నిర్మాణంపై ఘర్షణ పడి బీఆర్ఎస్ కార్యకర్తనుహత్య చేశారని ఆరోపించాయి. నాగర్‌కర్నూల్ జిల్లా గంట్రావుపల్లిలో చిక్కేపల్లి మల్లేశ్ హత్య ఉదాంతం మర్చిపోలేమని అంటున్నాయి. ధర్మపురిలో బీఆర్ఎస్ కార్యకర్త మాధవ్‌పై హత్యాయత్నం చేశారని అంటున్నాయి.

### కేటీఆర్ వంటి నేతలనూ వదలని వైనం..

**గత** మార్చిలో సీఎం రేవంత్‌రెడ్డిపై 'ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించిన వెంటనే ఆయనపై పలుచోట్ల 504, 505 సెక్షన్ల కింద జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించారు. ఇప్పుడు 'డబుల్ ఆర్' ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఏకంగా ప్రధాని మోదీ ఆరోపించినా ఎలాంటి చర్యలూ లేవని బీఆర్ఎస్ నేతలు ఫైరవుతున్నారు. నాడు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై చర్యలు చేపట్టాలని ఆర్టీసీ, విద్యుత్తుశాఖల నుంచి నోటీసులు ఇప్పించారని, మాజీ మంత్రి మల్లారెడ్డిపై ఏకంగా భూ కబ్జా కేసులు పెట్టించారని గుర్తుచేశారు. సీఎం వ్యాఖ్యలకు చెప్పుతో కౌంటర్ ఇచ్చిన బాల్క సుమన్‌పై అక్రమ కేసులు పెట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మరికొందరిపై కేసులు నమోదుకు డీజీపీకి లేఖలిచ్చారని గుర్తుచేస్తున్నారు.

# నీటి కొరత తీవ్రంగా ఉంది

## సాగర్‌టెయిల్‌పాండ్ నుంచి తీసుకున్నాం: ఏపీ

హైదరాబాద్, మే2 (నమస్తే తెలంగాణ): నీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలోనే సాగర్‌టెయిల్ పాండ్ నుంచి నీళ్లు మళ్లించామని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ)కు ఏపీ సర్కారు వెల్లడించింది. టెయిల్‌పాండ్ నుంచి అనుమతుల్లేకుండా 3 టీఎంసీల నీళ్లను మళ్లించుకుపోవడంపై తెలంగాణ బోర్డుకు ఫిర్యాదు చేసింది. దీనిపై వివరణ కోరుతూ బోర్డు ఏపీకి లేఖ రాసింది. బోర్డు లేఖపై తాజాగా ఏపీ స్పందిస్తూ.. తీవ్ర నీటి కొరత కారణంగా 4 టీఎంసీలను కావాలని గత త్రీమెన్ కమిటీ సమావేశంలోనే విన్నవించామని బదులిచ్చింది. అందులో భాగంగానే సాగర్‌టెయిల్‌పాండ్ నుంచి నీటిని మళ్లించుకున్నట్టు బోర్డుకు వివరించినట్టు తెలిసింది.

**ఎండా కాలం**

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 46.6°c | 34.1°c |
| ఆదిలాబాద్ | 46.2°c | 24.3°c |
| ఖమ్మం | 46.0°c | 26.0°c |
| మహబూబ్‌నగర్ | 45.4°c | 35.8°c |
| నిజామాబాద్ | 44.0°c | 27.9°c |
| రంగారెడ్డి | 43.9°c | 21.1°c |
| మెదక్ | 43.2°c | 22.6°c |
| వరంగల్ | 43.0°c | 28.0°c |
| హైదరాబాద్ | 42.3°c | 29.2°c |
| కరీంనగర్ | 42.0°c | 27.0°c |

# నాలుగు రోజుల్లో 49 డిగ్రీలకు!

- రాష్ట్రంలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు
- నల్లగొండ జిల్లా ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 46.6 డిగ్రీలు నమోదు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంపై భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఫలితంగా రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతున్నాయి. ఇప్పటికే 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు.. మరో నాలుగు రోజుల్లో 49కి చేరవచ్చని వాతావరణశాఖ అంచనా వేసింది. వడగాడ్పులు వీస్తాయని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వైద్య, వాతావరణశాఖలు హెచ్చరిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పలు చోట్ల 46 డిగ్రీలపై ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. నిరుడు మే నెలతో పోల్చితే ఈ సారి 7.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం నుంచి శనివారం వరకు దీర్ఘకాల వడగాడ్పులు కొనసాగుతాయని భారతీయ వాతావరణశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏ శ్రావణి తెలిపారు. రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 46.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేటలో 46.5, భద్రాద్రి-కొత్తగూడెంలో 46.5, ములుగులో 46.5, పెద్దపల్లిలో 46.4, జగిత్యాలలో 46.4, మహబూబాబాద్‌లో 46.3, కరీంనగర్‌లో 46.2, వరంగల్‌లో 46.2, మంచిర్యాలలో 46.2, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 45.3, జనగామలో 45.3, యాద్రాద్రి-భువనగిరిలో 45.6, నిర్మల్‌లో 45.5, జయశంకర్‌లో 45.5, మహబూబ్‌నగర్‌లో 45.4, హనుమకొండలో 45.1, సిద్దిపేటలో 45.1, నారాయణపేటలో 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలంగాణ స్టేట్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సొసైటీ వెల్లడించింది.

### 6 నుంచి మోస్తరు వానలు

రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి తేలికపాటి, మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ తెలిపింది. సోమవారం కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. గురువారం జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో తీవ్రమైన వడగాడ్పులు కొనసాగాయి. శుక్రవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడ వడగాడ్పులు వీస్తాయని చెప్పింది. మే నెలలో మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణశాఖ హెచ్చరించింది. 6 వరకు కర్ణాటక, ఏపీ, తెలంగాణ, పుదుచ్చేరిలో ఎండల తీవ్రత ఉంటుందని సూచించింది. 4 వరకు జార్ఖండ్‌లో, 3 వరకు కేరళ లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వివరించింది.

# వడదెబ్బ మరణాలు లేవు

## రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ

హైదరాబాద్, మే 2 (నస్తే తెలంగాణ) : వడదెబ్బతో ఏడుగురు మృతి చెందినట్టు పత్రికలో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని, వారు వివిధ కారణాలతో చనిపోయినట్టు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ స్పష్టం చేసింది. వికారాబాద్ జిల్లాలో 1న మృతి చెందిన ఉపాధ్యాయురాలు రాణి (45), ఆదిలాబాద్ జిల్లాలో ఆత్రం జంగు (46), కరీంనగర్ జిల్లాలో ఆర్ నర్సయ్య (46) గుండెపోటుతో మృతిచెందారని, రంగారెడ్డి జిల్లా కందుకూరులో చనిపోయిన 65 ఏండ్ల గుర్తుతెలియని వ్యక్తి మద్యం అలవాటుతో తలెత్తిన ఆరోగ్య సమస్యలతో, కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ఇతర కారణాలతో మరో వ్యక్తి మృతి చెందినట్టు తెలిపింది. మృతిచెందిన వ్యక్తుల్లో ఎవరికీ వడదెబ్బ లక్షణాలు లేవని తెలిపింది.

# కేటీఆర్‌పై విమర్శలు.. ఈసీకి పట్టవేమి?

- ఫోన్ ట్యాపింగ్‌లో కేటీఆర్‌పై ఆరోపణలు
- ఈసీకి ఫిర్యాదు చేసినా స్పందన నిల్
- హైకోర్టులోనూ ముగిసిన వాదనలు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై జాతీయ, రాష్ట్ర నాయకులు ఇష్టమొచ్చినట్టు విమర్శలు చేస్తున్నా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం లేదంటూ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం హైకోర్టు విచారించింది. సీజే జస్టిస్ అలోక్ అరా ధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం వ్యాజ్యాన్ని విచారించింది. ఈసీ తరపు న్యాయవాది దేశాయ్ అవినాశ్ వాదనలు వినిపిస్తూ.. బీఆర్ఎస్ ఫిర్యాదులను చట్టప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వాస్తవాలను నిర్ధారించుకోకుండా జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను నియంత్రించేందుకు ఈసీ ఎలాంటి ఆదేశాలు జారీచేయలేదని కోర్టుకు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వెనక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉన్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, రాహుల్‌గాంధీ, కేకే మహేందర్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డితోపాటు బీజేపీ నేత, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా కేటీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడారని న్యాయవాది మయూర్‌రెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ ఫిర్యాదు పరిశీలనలో ఉన్నదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఈసీ న్యాయవాది చెప్పడంతో విచారణను ముగిస్తున్నట్టు హైకోర్టు తెలిపింది.

# హైదరాబాద్‌ను యూటీగా మార్చే కుట్ర

- బీజేపీ కుటిల యత్నాలను తిప్పికొట్టాలి
- పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని నాశనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మల్కాజిగిరి రోడ్‌షోలో కేటీఆర్

జూబ్లీహిల్స్, మే 2: జూన్ 2 తరువాత హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భావిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సంచలన ఆరోపణలు చేశారు. పదేండ్లుగా అన్ని వర్గాల ప్రజలతో ఆనందంగా ఉన్న హైదరాబాద్‌ను కుక్కలు చింపిన విస్తరిలా చేయాలని చూస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ కుటిల యత్నాలను తిప్పి కొట్టేందుకు ప్రజలంతా ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. గురువారం ఆయన మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మూసాపేటలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజల మధ్య మతం చిచ్చుపెట్టి ఓట్లు దండుకునే పనిలో మోదీ, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను నయవంచన చేసేందుకు రేవంత్‌రెడ్డి మళ్లీ వస్తున్నారని దుయ్యబట్టారు. 'పేగులు మెడలో వేసుకుని తిరుగుతా', 'పండబెట్టి తొక్కుతా' అనే చిల్లర మాటలు తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల కోసం చేసిందేమిటని నిలదీశారు. నాడు కేసీఆర్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తే, నేడు రేవంత్ నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నారని విమర్శించారు. హైదరాబాద్‌కు కొత్త కంపెనీలు వచ్చుడు కాదు, బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన కంపెనీలు కూడా వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌తో పోటీయే లేదని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



గురువారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని శ్రీరామ్‌నగర్ రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు

# రేవంత్‌రెడ్డే ఫేక్!

మొదటిపేజీ తరువాయి...

అధినేత కేసీఆర్ ట్వీట్ చేయడం, ఆ మరుసటి రోజు సీఎం రేవంత్‌రెడ్డి కూడా మరో పోస్ట్ పెట్టడం, బీఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్‌ను అరెస్టు చేయడం తదితర పరిణామాలపై కేటీఆర్ వివరించారు. నీటికొరత, కరెంట్ సమస్య కారణంగా నెల రోజులపా టు ఓయూ హాస్టల్స్‌కు సెలవులు ఇస్తున్నట్టు చీఫ్ వార్డెన్ ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారని తెలిపారు. పోటీ పరీక్షల నేపథ్యంలో దీనిని వ్యతిరేకిస్తూ ఓయూ విద్యార్థులు ధర్నాకు దిగారని వివరించారు. ఈ నేపథ్యంలో కరెంటు కోత, తాగునీటి సమస్యపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ, ఓయూ ఉదంతాన్ని ఉదహరిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ట్వీట్ చేశారని గుర్తుచేశారు. ఆ వెంటనే చీఫ్ వార్డెన్‌కు యూనివర్సిటీ రిజిస్ట్రార్ షోకాజ్ నోటీసు ఇచ్చారని, ఎస్పీడీసీఎల్ నుంచి కూడా కరెంట్ సమస్య లేదంటూ 'వైస్ చైర్మన్' పేరుతో నోటీసు ఇచ్చారని పేర్కొన్నారు. 'వైస్ చాన్స్‌లర్'కు బదులు 'వైస్ చైర్మన్' అని పేర్కొనడం చూస్తుంటే ఈ ప్రభుత్వం తెలివి తేటలు అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. మరోవైపు, కేసీఆర్ ట్వీట్ చేసిన మరుసటి రోజే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ట్విట్టర్‌లో ఒక నోటీస్ పెట్టారని, తెలిపారు.

### సీఎం పోస్ట్ చేసిన నోటీసుపై విద్యార్థుల ఆగ్రహం

సీఎం రేవంత్‌రెడ్డి పెట్టిన నోటీస్ నకిలీదని వెల్లడిస్తూ, ఓయూ విద్యార్థులే అసలైన నోటీసును సోషల్ మీడియాలో వెలుగులోకి తెచ్చారని కేటీఆర్ వివరించారు. ముఖ్యమంత్రే ఫోర్జరీ డాక్యుమెంట్‌ను ట్విట్టర్‌లో పోస్ట్ చేయడం ఏమిటని విద్యార్థులు ప్రశ్నించారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి అనే ఒక పనికిమాలిన నాయకుడు, సీఎం అయి ఉండి కూడా తన పర్సనల్ ట్విట్టర్ ఖాతా ద్వారా ఫేక్ నోటీసును ట్విట్టర్‌లో పోస్ట్ చేశారని, ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా చిల్లర ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఇలా ముఖ్యమంత్రి ఫేక్ డాక్యుమెంట్ చేయొచ్చా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పోస్ట్ చేసిన ఫేక్ డాక్యుమెంట్‌లో చీఫ్ వార్డెన్ స్టాంప్‌ను కూడా మార్చేశారని వివరించారు. ఫేక్ డాక్యుమెంట్ ద్వారా తప్పు చేసింది సీఎం రేవంత్‌రెడ్డి అయితే, బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి, 14 రోజుల రిమాండ్‌కు పంపించారని మండిపడ్డారు. అసలు జైల్లో ఉండాల్సింది ఎవరు.. ఫేక్ డాక్యుమెంట్ పెట్టిన రేవంత్ రెడ్డా? అది ఫేక్ డాక్యుమెంట్ అని చెప్పిన క్రిశాంకా? అని ప్రజలు ఆలోచించాలని కోరారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించడం నేరమని, ఈ చర్యలకు పాల్పడిన రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తప్పు ఒప్పుకోవాలని హితవు చెప్పారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉన్న క్రిశాంక్ మీద ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసు నమోదుచేశారని, దీనిని ప్రజాస్వామికవాదులందరూ ఖండించాలని కోరారు. క్రిశాంక్‌ను వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఫేక్ డాక్యుమెంట్ పోస్ట్ చేశారని, ఆయనపై ఫోర్జరీ కేసు పెట్టాలని ఓయూ విద్యార్థులు కూడా ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫేక్ సర్క్యులర్ పోస్ట్ చేసినందుకు రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

### ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలి

తెలంగాణ ఉద్యమంలో ఇలాంటి ఎన్నో కేసులు, వేధింపులు చూశామని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ స్పష్టంచేశారు. న్యాయ వ్యవస్థ మీద తమకు నమ్మకం ఉన్నదని చెప్పారు. సత్యమేవ జయతే అన్నట్టుగా సత్యం, న్యాయం ఏనాటికైనా గెలుస్తుందని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ మొహబ్బత్ కా దుకాణ్ అంటారని, కానీ, తమ కార్యకర్తల మీద ఈ ప్రభుత్వం దాడులకు తెగబడుతున్నదని విమర్శించారు. వీటన్నింటికి మే 13న బీఆర్ఎస్‌కు ఓటు వేయడం ద్వారా జవాబు చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఈసీ చర్యలు తీసుకుంటుందా? లేదా? అనేది కాలం నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి ఇవ్వని నోటీసుకు ఇచ్చినట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని, బీజేపీ, రేవంత్ షాడో ఫైటింగ్ చేసుకుంటున్నారని పేర్కొన్నారు.